## క్లుప్తంగా

### నాటక కళాకారులకు సన్మానం



నాటక కళాకారులను సన్మానిస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: ప్రపంచ రంగ స్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాకారులను ఘనంగా సన్మానించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్న ప్రసాద్ చేతుల మీదుగా నాటక కళాకారులు కెర్ల పుల్లారావు, మణిబాల, పేరూ సత్యనారాయణ, యడవల్లి వాసుదేవుడులకు శాలువా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కళాకారుడు పుల్లారావు మాట్లాడుతూ నాటక రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. భూత, భవిష్య, వర్తమానాలకు పునాదిగా నిలిచే ఏకైక కళారూపం నాటకమని దీనిని ప్రజలు ఆదరించడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో చిన్న అప్పాజీ, ధనరాజు, పైడా రవి, కృష్ణమోహన్, రేలంగి బాపిరాజు, రెడ్నం రాజా, ఎడవల్లి కృష్ణ, అడబాల సత్యనారాయణ, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామదేవత, సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



విజయరాయుడుపాలెంలో గ్రామదేవతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండలం విజయరాయుడుపాలెంలో పునర్నిర్మించిన ఆలయాల్లో బుధవారం గ్రామ దేవత గోగులమ్మతల్లి, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామస్తుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు వంతున మంజూరు చేయగా ఆలయాలను నిర్మించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, పూజలుచేశారు. ఆలయ కమిటీ సభ్యులు బొండా సూర్యనారాయణ (చంటిబాబు), పేపకాయల పుల్లేశ్వరరావు తదితర గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### చంద్రబాబు కుయుక్తులు ప్రజలు గమనిస్తున్నారు



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: చంద్రబాబు అండ్ కో కుయుక్తులు ప్రజలు గమనిస్తున్నారని, మే నెలలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని, జగనన్న మళ్లీ సీఎం అవుతారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఉభయ గోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. మేం సిద్ధం బస్సు యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని బుధవారం రాత్రి ఆమె మీడియాకు తెలియజేశారు. సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయన్నారు. చంద్రబాబు వల్ల కుంపటే తప్ప ఏమి ఉండదని ఆమె పేర్కొన్నారు. మూడు పార్టీలు కాదు 30 పార్టీలు వచ్చినా ప్రజలు జగన్‌ను గెలిపించుకుంటారన్నారు.

### వైభవంగా శ్రీపుష్పయాగ మహోత్సవం



కుమారస్వామి శ్రీపుష్పయాగ మహోత్సవానికి ముస్తాబైన దేవతామూర్తులు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని భీమేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న వల్లీ దేవసేన సమేత కుమారస్వామి శ్రీపుష్పయాగ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తనికెళ్ల బుచ్చివెంకటశాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తకంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొడమంచలి కార్తీక్, ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హఫీజ్ డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విద్యార్థుల సమస్యలపై మేనిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు. 10 జాతీయ డిమాండ్లు, 13 రాష్ట్ర డిమాండ్లను బుధవారం ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు తదితరులకు అందజేసినట్లు హఫీజ్ వివరించారు. యూనిట్ నాయకులు అస్లం, దావూద్, మొహిద్దీన్, అబ్దుల్ రఖీబ్, జమాలుద్దీన్ తదితరులు ఉన్నారు.

# స్పృజనకు వేదిక

- జేఎన్‌టీయూకేలో ఇన్నోవేషన్ ఫెయిర్ ప్రారంభం
- ప్రాజెక్టులతో మెప్పించిన ఇంజినీరింగ్ విద్యార్థులు
- 150కి పైగా ప్రాజెక్టుల ప్రదర్శన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తమ ఆలోచనలకు సాంకేతికత జోడించి నూతన ఆవిష్కరణకు నాంది పలికారు ఇంజినీరింగ్ విద్యార్థులు. కాకినాడ జేఎన్‌టీయూకేలో రెండు రోజుల పాటు నిర్వహించే ఇన్నోవేషన్ ఫెయిర్ బుధవారం ప్రారంభమైంది. ఇందులో వర్సిటీ అనుబంధ కళాశాలలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించి సందర్శకులను ఆలోచింపజేశారు. వర్సిటీ డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ ఆధ్వర్యాన ప్రారంభమైన ఈ ఫెయిర్‌లో 150కు పైగా ప్రాజెక్టులు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా నన్నయ వర్సిటీ వీసీ డాక్టర్ కొప్పిరెడ్డి పద్మరాజు, జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు హాజరై ప్రారంభించారు. మొదటి మూడు స్థానాల్లో నిలచిన విజేతలకు గురువారం సాయంత్ర బహుమతులు అందజేయనున్నారు.



ప్రాజెక్టును సందర్శించి వివరాలు అడుగుతున్న నన్నయ వర్సిటీ వీసీ పద్మరాజు, జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు

**మొదటి ప్రాజెక్టు: పంటకు పట్టిన తెగులు గుర్తించడం**

**ఉద్దేశం:** నేటి కాలంలో వరిపంట నుంచి మొక్కజొన్న, పెసర, మినుము వంటి వాణిజ్య పంటలకు సంబంధించి మొక్క లేదా ఆకుకు వ్యాధి వచ్చినప్పుడు తొలిదశలో దానిని గుర్తించి, అది విస్తరించకుండా నిర్మూలించడం. అంతేగాక తెగులు సోకిన ఆ ఆకు లేదా మొక్కను స్కాన్‌చేసి ఇంటర్నెట్‌లో వెతికి ఏ రకమైన మందు కొట్టాలో వివరించడం.

**విద్యార్థుల బృందం:** ఎ.వెంకటేష్, ఎస్.ప్రసూన, ఎం.అనిల్, కె.శృతి. బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, భట్లపాలెం




విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు

**ప్రాజెక్టు: స్మార్ట్ జీబ్రా క్రాసింగ్**

**ఉద్దేశం:** జీబ్రా క్రాసింగ్ వద్ద ప్రమాదాల నివారణ. విద్యాలయాల కూడళ్ల, స్కూల్ జోన్ వంటి ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్ వద్ద ప్రమాదాల నివారణకు స్మార్ట్ జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు ద్వారా ప్రమాదాలు నివారించడం.

**వాడిన పరికరాలు:** ఆర్‌డీఎస్‌ఓ, సర్వర్ మోటర్, బజర్, ఎల్ఇడీ, ప్లైవుడ్

**విద్యార్థుల బృందం:** జగదీష్, ప్రసన్నకుమార్, పీవీపీ సిదార్థ ఇంజినీరింగ్ కళాశాల.



స్మార్ట్ జీబ్రా క్రాసింగ్ ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులు

**ప్రాజెక్టు: కైనటిక్ ఫుట్‌పాత్**

**ఉద్దేశం:** మానవుని నడక ద్వారా విద్యుత్‌ను తయారు చేసి వినియోగించడం. ఉదయం లేదా సాయంత్రం వేళలో ఎక్కువగా ఫుట్‌పాత్‌లపై వాకింగ్ లేదా నడిచే వారి నుంచి నడక ఒత్తిడి నుంచి విద్యుత్‌ను తయారు చేసి దానిని వీధిలైట్లకు వినియోగిచండం.

**వాడిన పరికరాలు:** 24 వాట్ల బ్యాటరీ, డీసీ మోటర్, సైకిల్ చైన్ స్ప్రోకెట్, ప్లైవుడ్ స్ప్రింగ్, స్ట్రీట్‌లైట్, ప్యాడ్.

**విద్యార్థుల బృందం:** ఎ.రేవంత్‌కుమార్, ఎం.నాగశ్రీ, విష్ణు ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం

విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు



**ప్రాజెక్టు: సోలార్ బేస్డ్ వైర్‌లెస్**

**ఉద్దేశ్యం:** వైర్‌లెస్ ద్వారా సోలార్ వాహనాలకు రీచార్జి చేయడం.

నేటి కాలంలో సోలార్‌తో నడిచే వాహనాలు 20 శాతం వరకూ వచ్చేశాయి. రానున్న ఐదేళ్లలో వీటి సంఖ్య మరింత పెరిగి చార్జింగ్ పాయింట్లకు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో సోలార్‌తో వైర్‌లెస్ ద్వారా చార్జింగ్ ఎక్కే విధానం రూపొందించారు. ఇంటి పైభాగంలో సోలార్ ఉంటే కింద పార్కింగ్ వాహనాలను చార్జింగ్ చేయడం.

**వాడిన పరికరాలు:** ఐఆర్ సెన్సార్, పొటడిమోడ్, ఆర్‌డీనో, ఎల్ఈడీ డిస్‌ప్లే, రిలే మాడ్యులర్, రూఫ్ టాప్ టెక్నాలజీ సోలార్



ప్రాజెక్టుతో విద్యార్థుల బృందం

విద్యార్థుల బృందం: డి.హర్షిత, జి.అంజని, ఎం.చందుప్రియ, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల సూరంపాలెం.

### వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి సంతోష్‌నగర్‌లో రెడ్‌క్రాస్ వృద్ధాశ్రమంలో బర్రి నాగేశ్వర రావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు సుదర్శనరెడ్డి, సాయి, చాందిని రోగులను పరీక్షించి ట్రస్టీ ఎస్‌వీవీ తాతారావు చేతులు మీదుగా మందులు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, వీఎస్ఎన్ మూర్తి, రామారావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ సేవకు వేదిక ఎన్ఎస్ఎస్



ఉత్తమ వలంటీర్లను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సామాజిక సేవకు ఎన్ఎస్ఎస్ మంచి వేదికగా నిలుస్తుందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో బుధవారం ఎన్ఎస్ఎస్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సామాజిక అంశాలపై చైతన్యం కలిగించేలా సోషల్ ఇంజినీరింగ్ ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గత నెలలో 420 యూనిట్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన వలంటీర్లను సత్కరించారు. రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

## టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



రమా సునీతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం అధికార ప్రతినిధి మీసాల రమా సునీత బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్, ద్వారంపూడి మాట్లాడుతూ కుట్ర రాజకీయాలు చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన టీడీపీ విధానాలతో విసిగిపోయిన ఎంతో మంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి రానున్న ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలుగా తమను గెలిపించేందుకు పార్టీ కోసం కష్టించి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, జిల్లా ఐటీ సెల్ చైర్మన్ కృష్ణప్రియ, నాయకులు ముత్యాల సతీష్, తోట సతీష్, ఎస్.సత్యనారాయణ, తుమ్మల మోహన్, రామరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాలకు పటిష్ట భద్రత



కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన జేఎన్‌టీయూకే ఆవరణలోని సివిల్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు సూచనలు ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు ఓట్ల లెక్కింపునకు భద్రతతో సహా ఇతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న స్ట్రాంగ్‌రూమ్‌కు అదనంగా మరో రెండు అదనపు స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఆర్వో దొర, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏఈ రమేష్‌బాబు, సర్వేయర్ ఆచార్యులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## పక్షులకు విడిదిల్లు

పిఠాపురం: ఎండలు మండుతున్నాయి. పక్షులకు ఆహారం, నీరు దొరకడం కష్టంగా మారింది. మాకు ఆహారమిచ్చి, దాహార్తిని తీర్చండంటూ పక్షులు వేడుకొనే రోజులొచ్చేశాయ్. చెట్లు నీటి చెలమలు ఎండిపోయి, పక్షులకు ఆహారం, నీరు అందని పరిస్థితుల్లో.. కొందరు మహానుభావులు వాటికి అన్నీ అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా స్థానిక పీఠం ఆవరణలో పక్షులకు చలివేంద్రం నెలకొల్పారు. ప్రత్యేకంగా తొట్టెలు ఏర్పాటు చేసి, నీరు, ఆహారం పక్షులకు అందుబాటులో ఉంచారు. దీంతో ఎక్కడెక్కడి నుంచో పక్షులు అక్కడకు వచ్చి, తమ ఆకలి దప్పికలను తీర్చుకుని.. కిలకిలా రాగాలు పలుకుతున్నాయి.





తొట్టిలో నీటితో దాహాన్ని తీర్చుకుంటున్న పక్షులు



పీఠం తోటలో పక్షుల కోసం ఆహారం, నీరు



పక్షుల కోసం నీరు పోస్తున్న ఉమర్ ఆలీషా

## రంజాన్ ప్రార్థనలకు కన్నబాబుకు ఆహ్వానం



ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఆహ్వానిస్తున్న ముస్లిం పెద్దలు

కాకినాడ రూరల్: రంజాన్ పండగ సందర్భంగా ఏప్రిల్ 11న జేఎన్‌టీయూకే ఈద్గా మైదానంలో జరగనున్న ప్రత్యేక ప్రార్థనలకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మండలంలోని మసీద్‌ల ఇమామ్‌లు, మౌజన్లు, గురువులు, మసీదు పెద్దలు కోరారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీం బాషా ఆధ్వర్యంలో మసీదుల పెద్దలు కన్నబాబును కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని, తప్పకుండా హాజరవుతామన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు లతీఫ్ ఖాన్, షేక్ బషీర్, ఎండీ యాకూబ్, షేక్ ఎంకోజీ, ఎండీ జాఫర్, షేక్ సత్తార్, అహమ్మద్ మొహిద్దీన్ ఎండీ వల్లి, ఖాజా మొహిద్దీన్, అన్సారీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రగతికి కృషి చేయండి

- 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేయండి
- పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు



ఏపీవోలతో మాట్లాడుతున్న కన్నబాబు

కాకినాడ సిటీ: జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనులను సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టి జిల్లా ప్రగతి సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్ కె.కన్నబాబు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారులు, ఉపాధి హామీ పథకం ఏపీఓలతో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాలు, మండలం, జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవోలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి మేరకు విధులు నిర్వహించాలన్నారు. ఉపాధి పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేస్తున్న పనులపై ఆయన పలు సూచనలిచ్చారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి అధికారి మంచి ప్రవర్తన, మంచి అవగాహన, మంచి దృక్పథం కలిగి పని చేయాలన్నారు. ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, జెడ్పీ సీఈవో ఎ శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్ గోపాల్, డీపీవో కె.భారతి సౌజన్య, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎస్ఈ బీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయండి



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ సిటీ: కాకినాడ 26వ డివిజన్ నాగరాజుపేట ప్రాంతానికి చెందిన 20 మంది యువకులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేశారు. మాజీ కార్పొరేటర్ సంగాని నందం, డివిజన్ కన్వీనర్ కొప్పనాతి బాబి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వాడ్రేవు రాము, సంగాని సతీష్ నేతృత్వంలో వీరంతా పార్టీలో చేరారు. ద్వారంపూడి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పని చేయాలని సూచించారు. అత్యధిక మెజారిటీతో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ఘన విజయం సాధించగలమన్న ధీమాను ఎమ్మెల్యే ద్వారంపూడి వ్యక్తం చేశారు.

## నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ



జలాశయాన్ని సందర్శించిన కమిషనర్ వెంకటరావు

కాకినాడ: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అవసరమైన ముందస్తు కార్యాచరణను సిద్ధం చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. బుధవారం సాయంత్రం ఆయన సామర్లకోటలోని వేసవి జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో నీటి నిల్వలపై ఆరా తీశారు. రిజర్వాయర్ సామర్థ్యం ఎంత? ప్రస్తుతం నీటి నిల్వలు ఏ మేరకు ఉన్నాయి? ప్రజలకు సమృద్ధిగా నీరందించడానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా రూ.1.28 కోట్లతో వేసవి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అవసరమైతే అదనపు నీళ్ల ట్యాంకర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వేసవి తీవ్రతను బట్టి ముఖ్య ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈ మాధవి, డీఈ శ్రీనివాస్, ఏఈ సాంబశివరావు తదితరులు ఉన్నారు.